సాక్షి
తిరుపతి
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



పరిశీలన
స్మాల్ రాకెట్ ఇంటిగ్రేషన్ తనిఖీలను స్వాతంత్ర్యదినోత్సవం రోజు నిర్వహించినట్టు షార్ గ్రూప్ మేనేజర్ తెలిపారు. - 8లో



ఉద్యోగుల ఉన్నతే లక్ష్యం
యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	27
చిత్తూరు	35	26
తిరుమల	31	22
గూడూరు	37	28
నగరి	36	27

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ అడ్మిషన్ల గడువు పెంపు



డాక్టర్ మల్లికార్జునరావు

తిరుపతి సిటీ: ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో పలు కోర్సులకు అడ్మిషన్ గడువును సెప్టెంబర్ 5వ తేదీవరకు పొడిగించినట్లు సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.మల్లికార్జునరావు తెలిపారు. గురువారం ఆయన స్టడీసెంటర్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ), పీజీ (ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ), బీఎల్ఐసీ, ఎంఎల్ఐసీ, ఎంబీఏ, పీజీ డిప్లొమో కోర్సులలో చేరదలచిన విద్యార్థులు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అఫిషియల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మర్ని వివరాలకు ఫోన్ నం .7382929617లో సంప్రదించవచ్చన్నారు.

25న సామూహిక వరలక్ష్మీ వ్రతం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయం బ్రహ్మగుడి ఆవరణలో ఉదయం 7 నుంచి సామూహిక వరలక్ష్మీ వ్రతం ప్రారంభమవుతుందని, మహిళా భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పకడ్బందీగా ఓటర్ల సర్వే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఓటర్ల సవరణ పకడ్బందీగా పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీనాటికి ఓటర్ల ఇంటింటా సర్వే వంద శాతం పూర్తి చేయాలన్నారు. మరోవైపు సర్వేకు సంబంధించి రాజకీయపార్టీల ప్రతినిధులు ఇస్తున్న సూచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో 6,68,526 గృహాలు సర్వే చేయాల్సి ఉందని.. ఇప్పటి వరకు 4,92,681 కుటుంబాలు మాత్రమే సర్వే చేశారని గుర్తుచేశారు. గడువులోపు వంద శాతం సర్వే చేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో నగరపాలక కమిషనర్ హరిత, డీఆర్ఓ కోదండరామిరెడ్డి, ఈఆర్ఓలు కనక నరసారెడ్డి, కిరణ్‌కుమార్, రామారావు, చంద్రముని, నగరపాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు చంద్రారెడ్డి(వైఎస్సార్‌సీపీ), వరప్రసాద్(బీజేపీ), సుధారెడ్డి(టీడీపీ), చింతా మోహన్(కాంగ్రెస్), తహసీలార్లు వెంకటరమణ, జరీనాబేగం, శిరీషా, ఎన్నికల తహసీల్దార్ సురేష్‌బాబు, డీటీలు కిరణ్మయి, విజయభాస్కర్, జీవన్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో కోదండరామిరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వాహణపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు 3 కేటగిరీ పోస్టులకు రాత పరీక్షలను (కంప్యూటర్ ఆధారిత పరీక్షలు) నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని, పరీక్షల నిర్వహణ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు షిఫ్ట్‌లలో ఉంటాయని తెలిపారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.



నాపేరు వెంకటరత్నమ్మ. అన్నమయ్య జిల్లా, పీలేరు మండలం, ఎల్లంపల్లె గ్రామం. నా మనవడు గణేష్‌కు కాలు విరిగింది. తిరుపతి రుయాలో పది రోజులుగా చికిత్స పొందుతున్నాడు. మూడు పూటలా నాణ్యమైన భోజనాన్ని వడ్డిస్తున్నారు. నా మనవడికి పెట్టే అన్నమే నాకు కూడా సరిపోతోంది. సమయానికి అన్నీ వడ్డిస్తున్నారు. గతంలో ఆస్పత్రి అంటేనే భయపడేవాళ్లం. రోగి ఆస్పత్రిలో ఉంటే సహాయకులు హోటళ్ల చుట్టూ తిరిగేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పెద్దపెద్ద హోటళ్లలో మాదిరిగా అన్ని రకాలు వడ్డిస్తున్నారు. నా పెద్ద కొడుకు జగనయ్యకు నమస్కారాలు.

పోషకాల మెనూ.. నాణ్యతతో తిను!



ఇంట్లో కూడా ఇన్ని వంటకాలు ఉండవు



నా పేరు సునీత్‌కుమార్. మా ఊరు పుంగనూరు. నాకు షుగర్ ఉంది. కాలికి పెద్దగాయం ఏర్పడడంతో మూడు నెలలుగా రుయాలో చికిత్స పొందుతున్నా. ఇన్ని రోజులుగా ఇక్కడే ఉన్నా భోజనానికి ఏ రోజూ లోటు రాలేదు. ఏ హోటల్ నుంచి తెప్పించుకోలేదు. అందరికీ ఇస్తున్న మెనూతో పాటు, నాకు ప్రత్యేకంగా సంగటి, చపాతి ఇస్తున్నారు. నమూడు పూటలా ఇంట్లో కూడా సాధ్యం కాని విధంగా కర్రీ, గుడ్లు, రకరకాల టిఫిన్లు అందిస్తున్నారు. నాలాంటి పేదోళ్లు చాలా మంది ఇక్కడ వడ్డించిన వంటకాలతోనే సర్దుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటా.

గతంలో ఇలా..

ఉడికీ ఉడకని అన్నం. చాలీచాలని నీళ్ల సాంబారు. పులిసిపోయి..పాచి వాసన వచ్చే కర్రీ. అదీ ఎప్పుడు పెడతారో.. రోగికి ఎప్పుడు వడ్డిస్తారో తెలియని పరిస్థితి. ఈ క్రమంలో సహాయకులు ఆస్పత్రిలో పేషెంట్‌ని వదిలి హోటళ్ల చుట్టూ తిరిగేవాళ్లు. అధిక ధరలు వెచ్చించి ఆహార పదార్థాలు కొనుగోలు చేశారు. ఆస్పత్రుల ఖర్చులకు తోడు సహాయకుల తిండి ఖర్చు తడిసి మోపెడయ్యేది. అందుకే చాలామంది జబ్బు నయంగాకనే ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యేవారు. ఇచ్చే అరకొర సొమ్ముతో రోగులకు సరిపడా తిండిపెట్టలేక సంబంధిత కాంట్రాక్టర్లు తలలు పట్టుకునేవారు.

ఇప్పుడు ఇలా..



నాణ్యమైన వేడివేడి భోజనం. రుచికరమైన కూరలు. జబ్బును బట్టి రోగికి హైప్రొటీన్ వంటకాలు. డ్రైఫ్రూట్స్. పండ్లు. పాలు, రాగిజావ.. చపాతీ.. గుడ్డు.. చిక్కీలు.. అబ్బో..! ఒక్కటా రెండా.. స్టార్ హోటల్లో మాదిరిగా రోగికి సకల వంటకాలు అందిస్తున్నారు. నాణ్యతకు పెద్దపీట వేస్తున్నారు.ఆస్పత్రిలో రోగి ఎన్ని రోజులు ఉంటే అన్ని రోజులూ పోషకాలతో కూడిన వంటకాలు వడ్డిస్తున్నారు. ఇందులోనే రోగుల సహాయకులూ సర్దుకుంటున్నారు. డైట్ చార్జీలు పెంచడంతో కాంట్రాక్టర్లు సైతం ఉత్సాహంగా పనిచేస్తున్నారు. వైద్యాధికారులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ నాణ్యమైన డైట్ అందించేలా చర్యలు చేపడుతున్నారు.

- ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ డైట్
- వ్యాధులను బట్టి రోగులకు ప్రత్యేక పోషకాహారం
- రుయాలో డైట్ రెట్టింపు
- గతంలో ఒకరికి రూ.36, ప్రస్తుతం రూ.72కి పెంపు
- గర్భిణులకు రూ.100
- సీఎం వైఎస్.జగన్ నిర్ణయంపై సర్వత్రా హర్షం

రుయాలో రోగుల డైట్ మెనూ ధరలు

గత ప్రభుత్వ హయాంలో
రోగికి రోజుకు మూడు పూటలా రూ.36
బ్రేక్ ఫాస్ట్:– బ్రెడ్, మిల్క్
లంచ్:– రైస్, సాంబార్, కర్రీ, ఎగ్–1, అరటిపండు, మజ్జిగ
రాత్రి భోజనం:–రైస్, సాంబారు, కర్రీ, మజ్జిగ



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం డైట్ మెనూ ధరలు
రోగికి రోజుకు మూడు పూటలా రూ.72
ఉదయం బ్రేక్ ఫాస్ట్:–
ఉప్మా, కిచిడీ, ఇడ్లీ, పొంగలి, ఎగ్–1
మధ్యాహ్న భోజనం:–
రైస్, సాంబారు, ఆకుకూర పప్పు, అరటి పండు, కర్రీ, మజ్జిగ, సంగటి (డయాబెటిక్), ఎగ్–1
రాత్రి భోజనం:–
రైస్, సాంబారు, టమోటా పప్పు, కర్రీ, సంగటి (డయాబెటిక్), అరటిపండు, మజ్జిగ, డ్రైఫ్రూట్స్, చపాతి(డయాబెటిక్), ఎగ్–1

గర్భిణులకు స్పెషల్
గర్భిణులకు రోజుకు రూ.100
పై మెనూతో పాటు అధనంగా చిక్కీలు, రాగి జావా అందిస్తున్నారు. అలాగే టీబీ, ఎయిడ్స్, మానసిక రోగులకు హై ప్రోటీన్ డైట్‌ను అందిస్తున్నారు.



తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం రోగులకు కార్పొరేట్ తరహాలో మెనూ అందిస్తోంది. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకానికి వెచ్చించిన విధంగానే రోగులకూ పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోంది. రాయలసీమ పెద్దాస్పత్రిగా పేరుగాంచిన రుయాతో పాటు, జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల్లో గడచిన మూడు నెలలుగా స్పెషల్ డైట్ విధానం అమలుచేస్తోంది.

నాణ్యతే లక్ష్యం

ఈ ఏడాది ఏప్రిల్ 16వ తేదీ నుంచి ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ అమలవుతోంది. గతంలో బ్రేక్ ఫాస్ట్‌లో పాలు, బ్రెడ్‌తోనే రోగులు ఆకలి తీర్చుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం బ్రెడ్‌ను తొలగించి రోజుకొక టిఫిన్ వడ్డిస్తున్నారు. గతంలో మూడు పూటలకు కలిపి ఒక గుడ్డు ఇచ్చేవారు. ప్రస్తుతం రోగికి మూడు పూటలా గుడ్లు అందిస్తున్నారు. గర్భిణులకు అదనంగా చిక్కీలు, రాగి మాల్ట్‌ను డైట్‌లో చేర్చారు. టీబీ, ఎయిడ్స్, మానసిక వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు హైప్రొటీన్ డైట్‌ను వడ్డిస్తున్నారు.

జిల్లా సమాచారం

తిరుపతి రుయాలో ఓపీ సేవలు

ఓపీ	1,200 - 1,400
అడ్మిషన్లు:	150 -170
మెటర్నరీ ఆస్పత్రి ఓపీ :	270 - 300
అడ్మిషన్లు	120 - 150

ఏరియా ఆస్పత్రుల్లో..

ఆస్పత్రి	ఓపీ	అడ్మిషన్లు:
చంద్రగిరి:	150-160	20-25
శ్రీకాళహస్తి:	170-190	25-30
గూడూరు	90-100	10-50

పక్కాగా అమలు చేస్తున్నాం



రుయాలో రోగులకు మెరుగైన వైద్యంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ దిశగానే తిరుపతి రుయా ఆస్పత్రిలో కొత్త డైట్ మెనూను పక్కాగా అమలు చేస్తున్నాం. మూడు పూటలా ఎగ్, కర్రీ వంటివాటిని అదనంగా వడ్డిస్తున్నాం. తద్వారా వ్యాధి త్వరగా నయమయ్యేందుకు దోహదపడుతోంది.
–డాక్టర్ రవిప్రభు, సూపరింటెండెంట్, తిరుపతి రుయా ఆస్పత్రి

రోగులకు పౌష్టికాహారం



జిల్లాలోని అన్ని ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో రోగులకు పటిష్టంగా పౌష్టికాహారాన్ని మూడు పూటలా అమలు చేస్తున్నాం. గతంకంటే మెనూ రేట్లను పెంచడంతో మంచి ఆహారాన్ని అందించేందుకు వీలుపడింది. మెనూను సంబంధిత ఆస్పత్రుల అధికారుల పర్యవేక్షణలో ఉంచాం. ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదు.
– డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి, తిరుపతి

తిరుపతికి మరో ఆధునిక ఆడిటోరియం



ఆడిటోరియంలో సౌండ్ సిస్టమ్‌ను పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



అధునాతన హంగులతో రూపుదిద్దుకున్న ఆడిటోరియం

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక తిరుపతి నగరానికి మరో ఆధునిక ఆడిటోరియం అందుబాటులోకి రానుందని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన గురువారం రాత్రి స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్ డీ.హరిత, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డితో కలిసి జిల్లా ఆర్ట్ స్టూడియో, ఆడిటోరియాలను పరిశీలించారు. సీటింగ్ కెపాసిటీ, సౌండ్ సిస్టం అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. ఆయన మాట్లా డుతూ నగర వాసులు, కళాకారులు, ప్రముఖుల సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు స్మార్ట్ ఆడిటోరియం ఎంతో అనువుగా ఉంటుందన్నారు. పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభించి నగర ప్రజలకు అంకితం చేస్తామన్నారు. స్మార్ట్ సిటీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేసి నగర ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. రూ.40 కోట్లతో 600 మంది కూర్చునేలా సీటింగ్ కెపాసిటీతో ఆడిటోరియం సిద్ధమైందన్నారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ పనులన్నీ పూర్తయ్యాయని ఆడిటోరి అని ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగర దశను మార్చేలా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మరో ఆరు నెలల్లో తిరుపతి రూపు రేఖలు మార్చేలా ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డీఈ దేవిక, కార్పొరేటర్ నరేంద్రనాథ్ పాల్గొన్నారు.

స్వామియే శరణమయ్యప్ప



పంబ నుంచి కాలినడకన అయ్యప్ప సన్నిధికి వెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి..

తిరుపతి మంగళం: ఇరుముడి కట్టి శబరిమలైకి బయలుదేరి వెళ్లారు.. రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. గురువారం శబరిమలై చేరుకుని పంబలో పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి ఇరుముడి తలపై పెట్టుకుని కాలినడకన అయ్యప్ప సన్నిధికి చేరుకున్నారు. అనంతరం స్వామివారికి ఇరుముడి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మంత్రి వెంట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 7 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 75,776 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 22,700 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.4.14 కోట్లు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 16 గంటల్లో దర్శనం లభిస్తోంది.

మెరిసిన 'స్వాతి' కిరణం!

- గ్రూప్–1లో 8వ ర్యాంక్
- ఎస్‌ఐ నుంచి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపిక

జీవితంలో ఏదో ఒకటి సాధించాలనే పట్టుదల, కసి ఉంటే చాలు.. ఏదైనా సాధించొచ్చు.. అని నిరూపించారు.. తిరుపతి స్పెషల్‌బ్రాంచ్ ఎస్‌ఐ స్వాతి. 2022లో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్–1 పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎనిమిదో ర్యాంకు సాధించారు. గురువారం విడుదలైన ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. లాఠీ నుంచి సివిల్ డ్యూటీ వరకు పడ్డ కష్టాలు.. ఆనంద క్షణాలు ఆమె మాటల్లోనే..

తిరుపతి క్రైం: 'ఎస్‌ఐగా పనిచేస్తూనే మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని సంకల్పించా. భర్త మహేష్, అత్తామామలు పూర్తిగా సహకరించారు. వివాహమనంతరం గ్రూప్–1 పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యా. చదువుకుంటానంటే మరో ఆలోచన లేకుండా కుటుంబ సభ్యులు నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు. ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నాకు డెప్యూటీ కలెక్టర్ రావడం చాలా థ్రిల్లింగా ఉంది. సబ్ ఇన్‌స్పెక్టర్‌గా నేను ఎదుర్కొన్న కొన్ని సవాళ్లతో పాటు.. పై స్థాయికి వెళ్లాలంటే కష్టపడనిదే ఫలితం దక్కదని ఆలోచించా. అధిక సమయం చదవడానికి మొగ్గు చూపా. పర్సనల్ లైఫ్‌కు సైతం దూరంగా ఉన్నా. చదువుపైనే ఎక్కువ ధ్యాస పెట్టే దాన్ని. వేతనాన్ని కూడా వదులుకొని రోజుకు 12 గంటల పాటు చదివేదాన్ని. అధిక శాతం రివిజన్ ద్వారానే కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌లో ర్యాంకులు సాధించగలం. గ్రూప్–1 ఆఫీసర్‌గా ఈరోజు ర్యాంకు సాధించగలిగానంటే కేవలం నా భర్త సహకారంతోనే' అని స్వాతి తెలిపారు.

సాదాసీదా కుటుంబం

అనంతపురం జిల్లా, హిందూపురం మండలం, గురవనహళ్లికి చెందిన రత్నమ్మ, నాగరాజు దంపతుల గారాలపట్టి స్వాతి. చిన్ననాటి నుంచి చదువులో చురుగ్గా రాణించేది. 2008లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో, 2010లో ఇంటర్లో అత్యుత్తమ మార్కులు సాధించింది. 2013లో హిందూపురంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. అనంతరం ఒంగోలుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మహేష్‌తో వివాహమైంది. స్వాతిలో చదువుకోవాలనే పట్టుదల చూసిన భర్త ఆమెను పోటీ పరీక్షలకు సిద్ధం చేశారు. దానికి అత్తామామలు సైతం పూర్తిగా సహాయసహకారం అందించేవారు. ఇలా 2018లో స్వాతి ఎస్‌ఐగా ఎంపికయ్యారు. తిరుచానూరు, గాజులమండ్యం, శ్రీకాళహస్తి టూటౌన్ పోలీస్ స్టేషన్లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం తిరుపతిలో స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. మరింత ఉన్నత స్థాయికి చేరాలని గ్రూప్–1 పరీక్షలకు సిద్ధమయ్యారు. 2022లో జరిగిన గ్రూప్–1 పోటీ పరీక్షల్లో ఎనిమిదో ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. గ్రూప్–1 పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే పోస్టు దక్కాలనే కసితో హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు.



భర్త మహేష్‌తో స్వాతి

సబ్జెక్ట్ నాలెడ్జ్ పెంచుకోవాలి



గ్రూప్–1లో ర్యాంకు సాధించాలంటే కొన్నాళ్లు మన ఆనందాలకు దూరంగా ఉండాలి. 100 శాతం మనం అనుకున్న లక్ష్యం వైపే మన చూపు ఉండాలి. మన జ్ఞానాన్ని పెంచుకునే విధంగా అవసరమైన పుస్తకాలు, న్యూస్ పేపర్లలో వచ్చే ఆర్టికల్స్‌ను చదువుతూ ఉండాలి. వీలైనన్ని సార్లు ప్రతి సబ్జెక్టును రివిజన్ చేసుకోవాలి. బట్టీ పట్టి ర్యాంకు సాధిస్తామంటే అది సాధ్యమయ్యే పని కాదు. సబ్జెక్ట్ నాలెడ్జ్ పెంచుకోవాలి.
స్వాతి, డెప్యూటీ కలెక్టర్

క్షీరాభిషేకం



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, వెలుగు సిబ్బంది

నాగలాపురం: రాష్ట్ర వ్యాప్తంగా వెలుగు సిబ్బందికి 23 శాతం జీత భత్యం పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేయడంపై సర్వత్రా హర్షాతిరేఖాలు వ్యక్తమవుతున్నాయి. గురువారం నాగలాపురం మండలంలోని మార్కెట్ కేంద్రం ఆవరణలో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధ్యక్షతన నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు, సత్యవేడు, బుచ్చినాయుడు కండ్రిగ, కేవీబీపురంపురం మండలాలకు చెందిన వెలుగు సిబ్బంది ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాగలాపురం మండల కన్వీనర్ అపరంజిరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ సుధా చిన్నదొరై, ఎంపీపీ సింధూశ్యామ్, ఎంపీడీఓ పద్మజ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మూడో రైల్వే లైన్ పనుల పరిశీలన


రైల్వే లైన్‌ను పరిశీలిస్తున్న రైల్వే సేఫ్టీ కమిషనర్

గూడూరు రూరల్: గూడూరు–మనుబోలు మధ్య పూర్తయిన మూడో రైల్వే లైన్‌ను గురువారం సౌత్ సెంట్రల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ ప్రాంజీవ్ సక్సేనా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు గూడూరులో అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం గూడూరు– మనుబోలు మధ్య నిర్మించిన రైల్వే బ్రిడ్జిని రోడ్డు మార్గాన వెళ్లి పరిశీలించారు. తర్వాత సౌత్ క్యాబిన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థను తనిఖీ చేశారు.

ఉద్యోగుల ఉన్నతే లక్ష్యం

- శాశ్వత ఉద్యోగులకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం
- తాత్కాలిక, ఎన్‌ఎంఆర్‌లకు భారీగా జీతాల పెంపు
- బోధనేతర సిబ్బందికి 11వ పీఆర్సీ పేస్కేల్
- కారుణ్య నియామకాలతో ఉద్యోగుల కుటుంబాలకు ఆసరా
- రెగ్యులరైజేషన్‌కు సర్వీస్ నిబంధన ఎత్తివేతతో 630 మందికి లబ్ధి


ఎస్వీ యూనివర్సిటీ పరిపాలనా భవనం ముఖచిత్రం

తిరుపతి సిటీ: యూనివర్సిటీ ఉద్యోగులు, విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలను సైతం నెరవేర్చుతూ ఉద్యోగుల మన్ననలు పొందుతోంది. పెండింగ్‌లో ఉన్న అరియర్స్‌తోపాటు విశ్రాంత ఉద్యోగలకు రావలసిన పెన్షన్ బెని ఫిట్స్‌ను చెల్లించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. దీంతో పాటుగా కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌కు ఐదేళ్ల స ర్వీసు నిబంధనను ఎత్తివేసింది. ఈ నేపథ్యంలో ఎస్వీయూ పరిధిలోని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 630 మంది కాంట్రాక్టు అధ్యాపకులకుటుంబాలలో వెలుగులు నింపింది.

కష్టాలు 'తాత్కాలిక'మే

- తాత్కాలిక అధ్యాపకుల వేతనాలను రూ.19వేల నుంచి రూ.35 వేలకు పెంపు
- ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రతి ఏడాదీ రెన్యువల్ చేసుకునే అవకాశం.
- అకడమిక్ కన్సల్టెంట్స్‌కు ఉద్యోగ భద్రత కోసం జీవో నం.110.

బోధనేతర సిబ్బందికి

- 11వ పీఆర్సీ ప్రకారం పేస్కేల్.
- సకాలంలో పదోన్నతులు ఇవ్వడం, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) అమలు.
- గత ప్రభుత్వం చెల్లించని పెన్షన్ బెనిఫిట్స్‌ను పూర్తిగా చెల్లింపు.
- బోధనేతర సిబ్బందికి పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ఆలోచన.

తాత్కాలిక బోధనేతర సిబ్బందికి

- వర్సిటీ ఎన్‌ఎంఆర్ ఉద్యోగులకు జీతాలను రూ.13,800 నుంచి రూ.20,250కి పెంపు. దీంతో 600 మందికి లబ్ధి.
- తాత్కాలిక బోధనేతర సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన జీవో రావాల్సి ఉంది.
- టైం స్కేల్, ఎన్‌ఎమ్‌ఆర్ ఉద్యోగులకు తక్కువ బాడుగతో క్వార్టర్ సదుపాయం.
- హాస్టళ్లలో పనిచేస్తున్న ఎన్‌ఎమ్‌ఆర్ ఉద్యోగుల వేతనాలను హాస్టల్ అకౌంట్స్ నుంచి కాకుండా యూనివర్సిటీ డెవలెప్‌మెంట్ అకౌంట్ నుంచి చెల్లింపు.

శాశ్వత అధ్యాపకుల సంక్షేమమే ధ్యేయం

- యూనివర్సిటీలో మెదటి సారిగా అధ్యాపకులకు జీవో నం.54ను విడుదల చేసి ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ వర్తింపు.
- జీవో 20 ద్వారా ఎన్‌హాన్స్‌మెంట్ ఆఫ్ ఎర్నడ్ లీవ్. దీంతో పదవీ విరమణ రోజున అధ్యాపకులకు అదనంగా 10నెలల జీతం అందుతుంది.
- అధ్యాపకుల విరమణ వయస్సు 62 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ జీవో నం.39 విడుదల.
- అధ్యాపకులకు రావలసిన 2016కు సంబంధించిన ఆర్‌పీఎస్ అరియర్స్‌ను గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచగా, సీఎం జగన్ ప్రభుత్వం సుమారు రూ.25 కోట్లు చెల్లింపు.
- విశ్రాంత అధ్యాపకులకు రావలసిన పెన్షన్ బెనిఫిట్స్ రూ.60కోట్లు విడుదల.
- ప్రమోషన్ల మంజూరు.
- గ్యారెంటీ పెన్షన్ స్కీమ్(జీపీఎస్)జీవో విడుదలైతే సుమారు 300మంది ఉద్యోగలకు పెన్షన్ లభించే అవకాశంతో పాటు జీవిత భాగస్వామికి పెన్షన్ లభిస్తుంది.

జీతాలు పెంచి ఆదుకున్నారు



ఎన్‌ఎమ్‌ఆర్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం జీతాలు భారీ ఎత్తున పెంచింది. గత ప్రభుత్వాలు ఎన్‌ఎమ్‌ఆర్ ఉద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదు. తక్కువ బాడుగతో క్వార్టర్స్ సదుపాయం కల్పించారు. త్వరలో శాశ్వత ఉద్యోగులుగా గుర్తించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

-డాక్టర్ ఆకేపాటి శివానందరెడ్డి, ఎన్‌ఎమ్‌ఆర్ ఉద్యోగుల సంఘం, అధ్యక్షులు

కారుణ్య నియామకాలతో భరోసా



కోవిడ్‌తో మరణించిన శాశ్వత ఉద్యోగుల పిల్లలకు కారుణ్య నియామకాల ద్వారా శాశ్వత ఉద్యోగం కల్పించి బాధిత కుటుంబాలను ఆదుకున్న ఆపద్బాంధవుడు సీఎం జగన్. రాష్ట్రంలో ఉన్న సుమారు 3,824 నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీలను ప్రస్తుతం ఎన్ఎమ్ఆర్, టైంస్కేల్ మీద పనిచేస్తున్న ఉద్యోగులతో భర్తిచేసేందుకు కృషిచేస్తున్నారు. ఇందుకు సంబంధించిన జీవో త్వరలో విడదల కానుంది.

-కే.మురళీరెడ్డి, వైఎస్సార్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ స్టేట్ ప్రెసిడెంట్, ఎస్వీయూ, తిరుపతి

ఉద్యోగుల పక్షపాతి సీఎం జగన్



ప్రభుత్వ పాలనలో ఉద్యోగులే కీలకం అని విశ్వసించి ఉద్యోగులకు సీఎం చేసిన మేలు మరువలేనిది. యూనివర్సిటీ ఉద్యోగులకు ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్, ఎర్నడ్ లీవ్ వంటి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారు. భోదనా సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న కోట్ల రుపాయ ల అరియర్స్‌ను విడదల చేశారు. ప్రమోషన్ విషయంలో గత ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ ప్రభుత్వం ప్రమోషన్లు ఇచ్చి ఆదుకుంది.

-డాక్టర్ రెడ్డి భాస్కర్‌రెడ్డి, టీచింగ్ అసోసియేషన్ కార్యదర్శి, ఎస్వీయూ, తిరుపతి

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



నాన్ టీచింగ్ సిబ్బందికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే కొంత ఊరట కలిగింది. 11వ పీఆర్సీ ప్రకారం పేస్కేల్ అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దే. ఇదివరకు ఉన్న రిటైర్‌మెంట్ వయస్సును కూడా రెండేళ్లు పెంచేందుకు కసరత్తు చేస్తోంది. త్వరలో ఆమోదముద్ర పడుతుందని ఆశిస్తున్నాం. పెన్షనర్లకు అరియర్స్ చెల్లించి వారి జీవితాలలో వెలుగులు నింపారు.

-శ్రీనివాసరాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎస్వీయూ, తిరుపతి

పరిశీలన


అగ్నిబాన్ -ఎస్‌ఓఆర్-టీఈడీ రాకెట్

సూళ్లూరుపేట: అగ్నికుల్ కాస్మోస్ అనే ప్రయివేట్ సంస్థకు చెందిన అగ్నిబాన్-ఎస్‌ఓఆర్-టీఈడీ (సబ్‌ఆర్బిటల్‌టెక్ డిమాన్‌స్ట్రేషన్) స్మాల్ రాకెట్ ఇంటిగ్రేషన్ తనిఖీలను స్వాతంత్ర్యదినోత్సవం రోజున నిర్వహించామని షార్ గ్రూప్ మేనేజర్ గోపీకృష్ణ గురువారం రాత్రి తెలిపారు. ఇస్రోలోని వాణిజ్య విభాగమైన ఇన్‌స్పేస్ సంస్థ ఆహ్వానం మేరకు షార్‌లోని సౌండింగ్ రాకెట్ లాంచ్ పాడ్ నుంచి ప్రయోగించనున్న అగ్నిబాన్ రాకెట్ పనులను షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్‌తో పాటు శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు పర్యవేక్షించారు. అగ్నికుల్ రాకెట్‌కు సంబంధించి పేటెంట్ పొందిన అగ్నిలెట్ ఇంజిన్‌తో నడిచే సింగల్‌స్టేజ్ రాకెట్ కావడం విశేషం. ఇది త్రీడీ–ప్రింటెడ్, సింగిల్-పీస్, 6 కేఎన్ సెమీ క్రయోజనిక్ ఇంజిన్ సాయంతో అగ్నిబాన్ రాకెట్ నిలువునా నింగిలోకి ఎగురుతుంది. గతంలో సింగిల్ స్టేజ్ రాకెట్‌ను ఏటవాలుగా పడుకోబెట్టి ప్రయోగించేవారు.

ఉమ్మడి జిల్లాలో ఎస్‌ఐలకు సీఐలుగా పదోన్నతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలకు సీఐలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లాలో రామకుప్పం ఎస్‌ఐ వి.శ్రీనివాస్, నిత్యబాబు (పోలీసు శిక్షణా కేంద్రం), ఎం.మనోహర్ (చిత్తూరు ఎస్‌బీ), డి.గోపి (తిరుపతి అటాచ్) ఉన్నారు. తిరుపతి జిల్లాలో ఎం.తిమ్మయ్య (శ్రీకాళహస్తి), ఎన్.ప్రవీణ్‌కుమార్ (శ్రీసిటీ), ఎస్.హనుమంతప్ప (నాగలాపురం), ఎస్.వంశీధర్ (చంద్రగిరి), ఎం.మంజునాథరెడ్డి (బీఎన్.కండ్రిగ), ఆర్.వినోద్‌కుమార్ (తిరుపతి రూరల్), జి.ప్రకాష్‌కుమార్ (భాకరాపేట) ఉన్నారు. వీరిని కర్నూలు డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

గ్రామాల్లో టీడీపీ వల్లే అశాంతి

పిచ్చాటూరు: గ్రామాల్లో ప్రశాంతతను చెడగొట్టాలన్నదే ప్రతిపక్ష టీడీపీ ధ్యేయంగా కనిపిస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. గురువారం మండలంలోని అడవికొడియంబేడులో వైఎస్సార్‌సీపీ సానుభూతి సర్పంచ్ అభ్యర్థి కిరణ్‌కుమార్ తరపున ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో సర్పంచ్ పుష్పవతి హఠాన్మరణం వల్ల ఎన్నికలు జరుగుతున్నాయని, ఆ స్థానంలో మృతురాలి కుమారుడు కిరణ్‌కుమార్‌ను మానవతా దృక్పథంతో ఏకగ్రీవం చేయకుండా పోటీ పెట్టి గ్రామంలో అశాంతి నెలకొనే విధంగా టీడీపీ వ్యవహరించిందన్నారు. అలాగే గోవర్ధనగిరిలో సైతం వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు మరణిస్తే ఆ స్థానానికి పోటీపెట్టి సమస్యలు సృష్టించాలని ప్రయత్నిస్తోందని వాపోయారు. అడవికొడియంబేడులో మంచం గుర్తుపై ఓటేసి సర్పంచ్‌గా కిరణ్‌కుమార్‌ను గెలిపించాలని, గౌను గుర్తుపై ఓటేసి గోవర్ధనగిరి 7వ వార్డు సభ్యునిగా బాల సుబ్రమణ్యం రాజును గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి

తిరుమల: తిరుమలలోని గోగర్భం డ్యాం వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. తిరుమల పోలీసుల కథనం.. వెదురుకుప్పం మండలం, తిరుమలయ్యపల్లెకు చెందిన దేవయ్య(42) కూలి పనుల కోసం తిరుమలకి వచ్చాడు. ఈ క్రమంలో పనులు చేస్తుండగా గురువారం డ్రైవర్ ట్రాక్టర్‌ని స్టార్ట్ చేసి బ్రేక్ తొక్కే క్రమంలో ఎక్స్‌లేటర్‌ను తొక్కాడు. దీంతో ట్రాక్టర్ వేగంగా వెళ్లి అక్కడ పనిచేస్తున్న దేవయ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో దేవయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

మోహిత్‌కు వేద పండితుల ఆశీర్వాదం


మోహిత్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న తిరుపతి రూరల్ ఎంపీపీ, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని గురువారం పలువురు సత్కరించి అభినందనలు తెలిపారు. ఇందులో భాగంగా తిరుచానూరు యోగిమల్లవరంలో వెలసిన శ్రీకామాక్షి సమేత పరాశరేశ్వర స్వామివారి ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ చైర్మన్, చెవిరెడ్డి మోహిత్‌ను సత్కరించి స్వామి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్టోబర్‌లో మోహనమంత్ర-2023


విద్యార్థుల ప్రదర్శనను వీక్షిస్తున్న ప్రోచాన్సలర్ మంచు విష్ణు

చంద్రగిరి: మోహన మంత్ర కార్యక్రమాన్ని ఈ ఏడాది అక్టోబర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు మోహన్‌బాబు యూనివర్సిటీ ప్రోఛాన్సలర్ మంచు విష్ణు తెలిపారు. గురువారం మోహన మంత్ర కార్యక్రమంలో భాగంగా క్యాంపస్‌లో విద్యార్థులు పలు కార్యక్రమాలను ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 23వ తేదీన మోహన మంత్ర–2023 కార్యక్రమం ఉంటుందని, దక్షిణ భారతదేశంలోని అన్ని కళాశాలలు, యూనివర్సిటీల నుంచి సుమారు 30 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. ఆటపాటలతో పాటు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయన్నారు. వీసీ ఆచార్య నాగరాజ్ రామారావు, మంచు విరోనిక, మంచు ఆరియాన, వివియాన, ఎంబీయూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, రిజిస్ట్రార్ సారథి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో వార్డు కౌన్సిలర్‌పై అట్రాసిటీ కేసు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని నాలుగో వార్డు కౌన్సిలర్ బోడేలు శరత్‌చంద్రగౌడ్, శ్రావణ్‌కుమార్ అతని అనుచరులు కొంతమందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. పట్టణంలోని సోనియా గాంధీ నగర్‌లో షార్ విశ్రాంత ఉద్యోగి నిమ్మల బలరామయ్య కుటుంబ సభ్యులపై దాడి చేసిన ఘటనపై డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి విచారణ ప్రారంభించారు. నిందితులను త్వరలో అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు.

సెలెక్ట్ మొబైల్స్ మిషన్ ఈ-వేస్ట్ ప్రారంభం


మిషన్ ఈ-వేస్ట్‌ను ప్రారంభిస్తున్న టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి కల్చరల్: ఎలక్ట్రానిక్ వేస్ట్ నిర్వహణ, రీసైక్లినింగ్‌లో దేశంలోనే తొలిసారిగా మిషన్ ఈ-వేస్ట్ పేరుతో వినూత్న కార్యక్రమానికి మల్టీ బ్రాండ్ మొబైల్స్ రిటైల్ చైన్ సెలెక్ట్ మొబైల్స్ శ్రీకారం చుట్టింది. అన్నమయ్య సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ సెలెక్ట్ మొబైల్స్ మిషన్ ఈ–వేస్ట్ ప్రారంభోత్సవానికి టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి, కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించేందుకు తమవంతు బాధ్యతగా సెలెక్ట్, సెల్కాన్ మొబైల్స్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం సెలెక్ట్ మొబైల్స్ సీఎండీ వై.గురు మాట్లాడుతూ పర్యావరణంపై ఈ–వేస్ట్ ప్రభావం చాలా తీవ్రంగా ఉందన్నారు. ఈ –వేస్ట్ గాలి, నీరు, మట్టిని కలుషితం చేస్తూ చర్మ వ్యాధుల నుంచి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని సెలెక్ట్ మొబైల్స్ మిషన్ ఈ–వేస్ట్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. పనికిరాని మొబైల్ ఫోన్లు, ల్యాటాప్‌లు, వ్యక్తిగత ఎలక్ట్రానిక్ పరికరాలు, మౌస్, కీబోర్డులు వంటి స్పేర్‌పార్ట్స్‌తో పాటు అనేక రకాల ఎలక్ట్రానిక్ పరికరాలను ఈ –వేస్ట్‌గా పరిగణిస్తామని, వాటిని సెలెక్ట్ రిటర్న్ స్టోర్ తీసుకువస్తే కస్టమర్లకు రూ.10వేల వరకు డిస్కౌంట్ ఫోన్ అందుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం పరిమితి 30 రోజుల వరకు ఉంటుందన్నారు. షోరూం వద్ద ఈ–వేస్ట్ బిన్స్ ఏర్పాటు చేస్తామని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

శ్రీకాళహస్తిలో నేడు కన్నప్ప సినిమా షూటింగ్ ప్రారంభం

శ్రీకాళహస్తి/చంద్రగిరి : 24 ఫ్రేమ్స్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శుక్రవారం ఉదయం 9 గంటలకు కన్నప్ప సినిమా షూటింగ్ ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సినీ నటుడు మోహన్‌బాబు, హీరో మంచు విష్ణు, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సినిమాను మంచు అవరామ్ భక్త, మంచు ఐరా సమర్పణలో నిర్మిస్తున్నట్లు చెప్పారు.